

# కోనేటి జన్మ

శ్రీరంగం శ్రీనివాసరావు

నేడు సుదినం. నేడు కోనేటిరావు జన్మదినం.

మహారాజ రాజశ్రీ హెడ్డు గుమాస్తా జటావల్లభుల కోనేటిరావు పంతులుగారి నలభైఅయిదో జన్మదినం ఈరోజన్న సమాచారం మరారాత్రికే తెలియదు. కోనేటి జన్మదినం జాతీయ పర్వదినం కాదు. దీనికొక ప్రత్యేకత నాపాదించి పండుగ చేసుకోవలసిన అవసరం కోనేటిరావుకే లేకపోయింది. తూర్పు ఆసియా దేశాలలో ప్రళయం, పశ్చిమ యూరప్ దేశాల ప్రణయం, మధ్యప్రాచ్యంలో మంత్రసానిగండం మొదలైన ప్రపంచ ప్రచండవార్తల మధ్య ఇదివర కెప్పుడో నలభైనాలుగేళ్ళ కిందట కోనేటి రావనే ఆసామీ ఒకానొక పల్లెటూళ్లో జన్మించాడన్న కబురు, ఈ రచయితని తప్ప యింకెవ్వరినీ ఉత్సాహపరచ లేకపోయింది.

అయినా ఈ దినం కోనేటిరావు పుట్టిన రోజని తెలిసినప్పటికీ ఈ రచయిత "డాండ డడాండ డాండ నినదంబు లజాండమునిండ మత్తవేదండము నెక్కి" ఈ సంతోష వార్తని చాటలేక పోతున్నాడు. దీన్ని ఎలా వర్ణించాలో తెలియక ఇబ్బంది పడుతున్నాడు. "నేడు సుదినం" అని మాత్రం అని ఊరుకున్నాడు. ఇది ఎంచేత సుదినమో ఈ రచయితకికూడా తెలియదు.

కిందటేడు కూడా ఇలాగే నలభై నాలుగో కోనేటిమైలురాయినామమాత్రావశిష్టమైపోయింది. మీదటికైనాఇంతకన్న ఉత్తమపరిస్థితులలో కోనేటిరావు పుట్టినరోజు పండుగ చేసుకోగల సూచనలు సుతరామూ కనిపించవు. ఈలోపున అమెరికాలో కొందరి పెద్దల ఆశీర్వాదంవల్ల యుద్ధమే వచ్చేస్తే, సరి! మరి కోనేటిరావే కనిపించడు.

కోనేటిరావుగారి నలభై అయిదో జన్మదినంనాడు వాళ్ల ఆఫీసుకి సెలవు లేదన్న విషాదవిషయం ఒక్కటి మినహాయిస్తే తతిమ్మా లాంఛనాలన్నీ– కోనేటిరావుకి తెలియకుండా– సక్రమంగానే జరిగినట్లు చెప్పవచ్చును. తెల్లవారుజామున మలయానిలం మందమందంగా ప్రసరించింది. అదృష్టవశాత్తూ ఇది వసంతకాలం కావడం వల్ల మామిడి చెట్లు చిగిర్చడం, ఆ చిగుళ్లు మెసవి కొన్ని కోకిలలు పంచమస్వరావ్యంగా వగర్చడం జరిగింది. తిరుచినాపల్లి రేడియోలో యెవరో సుప్రసిద్ధ సోదరులు మంగళవాద్యాలు మ్రోగించారు. చాలారోజుల నించీ సాక్షాత్కరించని చాకలివాడు (చిరిగిపోయిన వైతేనేం) బట్టలన్నింటినీ బాకీపెట్టకుండా తీసుకొచ్చాడు. మరి ఆవిడకి తెలిసే చేసిందో తెలియకే చేసిందో తెలియదుగాని కోనేటిరావు భార్య బహురుచ్యమైన పిండివంటలు చేసి ఆఫీసు వేళకి ముందుగా వడ్డించింది. మస్తుగా భోజనం చేసి అవిఘ్నమస్తుగా కోనేటిరావు ఆఫీసుకు చేరుకున్నాడు.

కోనేటిరావు ఆఫీసు యాత్రని కొండొకచోట ఈ రచయిత ఇదివరకు వర్ణించాడుగాని పునరుక్తి అవుతుందనికూడా వెనుదీయకుండా ఆ ప్రయాణాన్ని మళ్లీ వర్ణించడాని కితడు ఉవ్విళ్లూరుతున్నాడు. అసలే కూర్మావతారం. అరమైలు ఆఫీసు దూరం రొప్పుతూ రోజుతూ కోనేటిరావు ఇంటినుండి ఆఫీసుకి బయలు వెడలెను. "వెడలెను కోదండపాణి" అని గాని, "రాజు వెడలె రవితేజములలరగ" అని గాని ఈ వెళ్లడాన్ని ఎవ్వరూ పాడడానికి సాహసించరు. ఒక గుమాస్తా తన పుట్టిన రోజున ఆఫీసుకి వెళ్లాడన్న విషయంలో సంగీతాన్నీ కవిత్వాన్నీ ప్రోత్సహించే పరిద్రవం

యతిక్రమించిత్తూ ఉండనేరదు. ఆపసోపాలు పడుతూ ఆఫీసుకి పోతున్న ఒక మానవుడి మహాప్రస్థానం సౌందర్యవంతమైన సంఘటన కాదు. ఇదేమీ హైదరాబాదు ప్రతినిధుల పారిస్ ప్రయాణం కాదు. ప్రధాన మంత్రిగారి సరిహద్దు పర్యటన కాదు. కోనేటిరావు అరమైలు దూరాన్ని అవలీలగా లంఘించి శాశ్వతంగా ఒక కొత్త రికార్డు స్థాపించాడనడం సత్యానికి అనేకలక్షల మైళ్ల దూరం. కోనేటిరావు రోజూలాగే ఈ రోజు కూడా ఈసురోమంటూ జీవిత సముద్రంలో ఈదుతున్నాడు. ఇదేమీ రసవంతమైన సన్నివేశం కాదని ఈ రచయిత ఇంకోసారి మనవి చేసుకుంటున్నాడు.

కోనేటిరావు జీవితరంగంలో ఏ మూల నుంచి కూడా ఏమాత్రమూ కవిత్వమనేది ప్రసరించకుండా కట్టుదిట్టాలు జరిగిపోయాయి. ఎందుచేత అని ప్రశ్నిస్తే ఏ జవాబూ రాదు సరికదా ఎన్నో ప్రశ్నలు బయలుదేరుతాయి.

ఏ శాపంవల్ల కోనేటిరావు తన నలభై అయిదో పుట్టినరోజున హాయిగా ఇంట్లో కూర్చోకుండా ఎండలో ఈదవలసి వచ్చింది? అతని పిల్లల చొక్కాలూ లాగులూ అతుకుల బొంతలు కావడానికి కారణమేమిటి? దాక్షిణ్యంలేని ఏ దుర్విధి శాసనంవల్ల కోనేటిరావు తలమీద చాలామట్టుకి జుట్టు ఊడిపోయి బట్టతల ప్రాప్తించడమే కాక ఉన్న జుత్తూ తెల్లబడిపోయింది? అతని చెమటతో తడిసిన రూపాయలకి అర్థం లేకపోవడం ఎంచేత?

ఏం ప్రయోజనంలే ఇలాంటిప్రశ్నలువేస్తే!

కోనేటిరావు తన నలభై అయిదో పుట్టినరోజున ఆఫీసులో కుర్చీలో కూర్చుని పనిచేసుకుంటున్నాడు. ఇదివరకు అతణ్ని కనబడకుండా బంధించిన సంకెళ్లు ఇంగ్లాండులో తయారైనవి. ఇప్పటి సంకెళ్లను ఇండియా తయారుచేస్తోంది. ఇవి స్వదేశీ సంకెళ్లు.

ఏమైనా ఇది సుదినం. ఇది కోనేటిరావు జన్మదినం.

## రాత్రిమజా

"గోపాలచక్రవర్తి"

రాత్రిదేవి, రంగుల్లో
చీరల్ని విప్పుతున్నది
ఆకసంనిండా మేఘాలు
వ్రేలాడే నల్లని వస్త్రాలవలె
దేవవేశ్య ఊర్వశి శిరోజాలవలె.
ఉన్మత్త మనోవల్మీకంలో
ఊర్ధ్వంగా ప్రసరించే
వేడి వేడి మజాతలపులవలె.
గదిలో వాడూ నేనూ
గదిబయట శ్వేతశునకరాజం
మహానామ రహితం
ఇప్పుడు నిద్రిస్తామా
మళ్లీ ఉదయాన్నే ఉదయిస్తాం.
లేదా వాకడ స్తమించనూవచ్చు
"ఫలానా ఫిడేలు లాల్చీ
కవి అస్తమయం చాలాకుర్రాడు.
చాసర్ నుండి సారోయన్ దాకా
క్షుణ్ణంగా చదివాడు.
(కాని అన్నీ మర్చిపోయాడని వాకవ్యాఖ్య.)
అఖండంగా ఖండకావ్యాలు
లక్షలు లక్షలుగా వ్రాశాడు."
ఇట్లా నడుస్తాయి దినపత్రికల ఘోషలు.
చచ్చినవాడికళ్లు "పసిఫిక్ వోషనంత"
నా జీవిత ప్రాంగణాన
కురిపించావు ముత్యాలవాన;
ఆతనిమాట వెన్నెలమాట
అనుకుంటుంవొక అమాయకపసుచు
పోనీ దౌర్భాగ్య భాషలో దినపత్రికా
సంపాదకత్వం (సంపాదన లేదుగా)
తప్పిందని నా సంతోషం
...ఇప్పుడు నిద్రిస్తామా
మళ్లీ ఉదయాన్నే ఉదయిస్తాం లేదా-

Source: Press Academy Website, Telugu Swatantra Magazine, Oct 1948

Disclaimer: This SELECTIVE topic/article/write-up is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/